
ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025 5 విజయనగరం



## అలరించిన సంగీత కచేరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక శంకర మఠంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నాదజ్యోతి ముత్తుస్వామి దీక్షితులు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కచేరీ, గోష్ఠిగానం అలరించాయి. అసోసియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, కార్యదర్శి డాక్టర్ మండపాక రవి, కోశాధికారి ధన్వాడ సుధాకర్, సుబ్బారావు, డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, డాక్టర్ శ్రీనగేష్ పోదూరి, మేడూరి లక్ష్మి శారద పాల్గొన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు

# ఆనందం.. కారాదు విషాదం



తారాజువ్వలు.. భూచక్రాలు.. వెన్నముద్దలు.. చిచ్చుబుడ్లీలు.. షాట్స్.. రాకెట్స్.. థౌజండ్ వాలాలు.. ఇలా మతాబులు కాల్చి దీపావళిని అందరూ సంతోషంగా గడుపుతుంటారు. దీపావళి రోజు సాయంత్రం కాగానే ప్రతి గ్రామంలో, పట్టణంలో అందరూ మతాబులు, బాంబులు, తారాజువ్వలు వెలుస్తుంటారు. దీపావళి అంటే ఇంటిల్లిపాది జరుపుకునే పండగ. అలాంటి పండగ సమయాన ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా తీవ్ర విషాదమే!. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. ప్రమాదాలు జరగకుండా ఈ దీపావళి జరుపుకోవాలని కోరుకుంటూ 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం..

- జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు దూరం
- రేట్లు పెంచేసిన యజమానులు
- షాపుల వద్ద కానరాని ధరల పట్టికలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో పర్మినెంట్ బాణసంచా విక్రయ కేంద్రాలు షాపులు కెఎల్‌పురంలో 10, చీపురుపల్లిలో 2, రాజాంలో 2, బాడంగి, మానాపురంలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. మండలాల వారీగా ఫైర్‌స్టేషన్ పరిధిలో తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. ప్రతిషాపు వద్ద రక్షణ చర్యలు పాటించేలా అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కెఎల్‌పురంలో ఏర్పాటుచేసిన పర్మినెంట్, తాత్కాలిక షాపుల వద్ద బందోబస్తును డిఎస్‌పి ఆర్.గోవిందరావు, వన్‌టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు పర్యవేక్షించారు. డిఎఫ్ఒ బివిఎస్ రామ్‌ప్రకాశ్, అసిస్టెంట్ ఫైర్ అధికారి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు అగ్నిమాపక శకటాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ మళ్లింపు చేపట్టారు.

### ముందుగా ఏం చేయాలంటే..

- గుర్తింపు పొందిన బాణసంచా పరిశ్రమలు తయారుచేసిన టపాసులు మాత్రమే కొనాలి.
- పిల్లలకు దగ్గరగా టపాసులు ఉంచకూడదు.
- ఇంటిలో గ్యాస్ సిలిండర్. ఆయిల్ క్యాన్లు లాంటి వాటికి దగ్గరగా ఉంచకూడదు.
- టపాసులతో పిల్లలను ఒంటరిగా అసలు ఆడనీయరాదు

### టపాసులు కాల్చేటప్పుడు ఏం చేయాలి?

- టపాసులను ఓపెన్ ఏరియాలో మాత్రమే కాల్చాలి.
- బాగా వదులుగా ఉన్న నూలు వస్త్రాలు ధరించాలి.
- టపాసులు వెలిగించటానికి క్యాండిల్ లేదంటే అగరబత్తి లాంటివి దగ్గర ఉంచుకోవాలి.
- రెండు బకెట్ల నీరు దగ్గరలో ఉంచుకోవటం మంచిది.
- చేతిలో ఉంచుకుని టపాసులు అంటించే ప్రయత్నం చేయకూడదు.
- అంటించి వచ్చిన వెంటనే కొన్ని టపాసులు వెంటనే పేలవు. అలాంటప్పుడు ఏమైందోనంటూ వాటిని పరిశీలించే ప్రయత్నం వెంటనే చేయకూడదు.
- అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ నీళ్లు పోసి ఆర్పే ప్రయత్నం చేయాలి.
- పెద్దగా ఒళ్లు కాలినప్పుడు బాధితుడిని శుభ్రమైన బెడ్‌షీట్‌లో చుట్టి వెంటనే హాస్పిటల్‌కి తీసుకువెళ్లాలి.

### చుక్కలనంటిన పటాసుల ధరలు

దీపావళి పండగకు ఈసారి బాణసంచా కొనేందుకు వెళ్లే వినియోగదారులు వాటి ధరలను చూసి బెంబేలెత్తి పోతున్నారు. గతేడాది కంటే ఈసారి మతాబులపై రెట్టింపు పెంచారని చెబుతున్నారు. గతంలో రూ.300 నుంచి ప్రారంభమయ్యే ఫ్యామిలీ ప్యాక్.. ఈ ఏడాది రూ.వెయ్యి, 1500, 2500కు చేరాయి. మతాబుల రేట్లు నియంత్రించాల్సిన అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి షాపు వద్ద ఏ మతాబు ఎంత ధర అనేది బోర్డులు ఉండాలి. ఏ ఒక్క షాపు వద్ద బోర్డులు కనిపించిన దాఖలాలు లేవు.

కొన్ని మతాబుల ధరలు (రూ..లో)

| | |
|---|---|
| 10,000 వాలా | 6000 |
| 1000వాలా | 450 |
| వెన్నముద్దలు(బాక్స్) | 200 |
| రాకెట్లు | 300 |
| షాట్స్ | 100 |
| కాకరపువ్వొత్తులు | 500 |
| భూచక్రాలు | 250 |
| అగ్గిపెట్టె బాక్సులు | 100 |
| చించు బుడ్డీలు | 300 |



విక్రయానికి సిద్ధంగా ఉంచిన టపాసులు

### అగ్నిమాపక నిబంధనలు పాటించాలి



దీపావళి పండగకు ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రతి షాపు యజమాని అగ్నిమాపక నిబంధనలు పాటించేలా ఆదేశాలు ఇచ్చాం. జిల్లాలో 16 పర్మినెంట్ షాపులు, మండలాల వారీగా తాత్కాలిక షాపులకు అనుమతులు ఇచ్చారు. ప్రతిఒక్కరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలి.

- బి.వి.ఎస్.రామ్‌ప్రకాశ్, జిల్లా అగ్ని మాపక అధికారి

# సర్కారు నిర్లక్ష్యం రోగులకు ప్రాణసంకటం

జామి మండల కేంద్రంలోని మాధవరాయమెట్టకు చెందిన ఓ వ్యక్తికి అప్రెంటిసైటీస్ రావడంతో నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా చికిత్సలు నిలిపేసినట్లు ఆ ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో రూ.60 వేలు ఇచ్చి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

విజయనగరంలోని పూల్‌బాగ్ ప్రాంతం అయ్యప్పనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి నాలుగు రోజుల క్రితం గుండెపోటు వచ్చింది. ఆయన్ను ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత వైద్యానికి ఆస్పత్రి యాజమాన్యం నిరాకరించింది. రోగి కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు లేవని బతిమలాడినా యాజమాన్యం చికిత్స చేసేందుకు కనికరించలేదు. డబ్బులిస్తేనే వైద్యం చేస్తామని కరఖండిగా చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కెజిహెచ్‌కు తరలించారు.



- 10 రోజులుగా నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవలు
- జిల్లాలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులు 36 ఉన్నాయి. ఇందులో 10 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. మిగతా 26 ఆస్పత్రులకు 22 ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను ఈ నెల పదో తేది నుంచి నిలిపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 16 నెలలైనా బకాయిపడ్డ బిల్లులను సర్కారు చెల్లించకపోవడంతో జిల్లాలోని ప్రయివేటు ఆస్పత్రులు ఎన్‌టిఆర్ వైద్య సేవలను నిలిపేశాయి. జిల్లా వ్యాప్తంగా అనేక మంది రోగులు ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సి ఉంది. ప్రయివేటు ఆస్పత్రులు ఎన్‌టిఆర్ వైద్యసేవలను నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తొలినుంచీ వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా 3257 రోగాలకు గాను వైద్య సేవలను అందిస్తారు. ప్రతిరోజూ ఎన్‌టిఆర్ వైద్య సేవ ఆస్పత్రులకు సుమారు 300 వరకు ఒపి ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్పత్రుల యాజమాన్యాలు ఎన్‌టిఆర్ వైద్య సేవలను నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఎన్‌టిర్ వైద్య సేవ గుర్తింపు పొందిన ఆస్పత్రులకు సుమారు రూ.35 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రయివేటు ఆస్పత్రులకు బకాయిలను చెల్లిస్తే ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశం ఉంది.

### 19 నుంచి 22కు

జిల్లాలో మొదటి రెండు రోజుల్లో 19 ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను నిలిపివేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్య సేవలను నిలిపేసిన ఆస్పత్రుల సంఖ్య 22కు చేరింది. ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిపివేసిన తరుణంలో ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలను ప్రభుత్వం చర్చలకు పిలిచి పేదలకు వైద్యసేవలు అందజేయాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు.

### వైద్య రంగంపై నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యరంగంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి పేదలు ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ప్రయివేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వివిధ వైద్య సేవలను పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆస్పత్రులకు రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఎన్‌టిఆర్ వైద్య సేవలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్ ఆస్పత్రులు నిలిపివేశాయి. దీంతో పేదలు తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి డబ్బులు చెల్లించి ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాల్సి వస్తోంది. ఎన్‌టిఆర్ వైద్య సేవలను ప్రయివేటు ఆస్పత్రులు 10 రోజులుగా నిలిపివేసినా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రోగులను తరలిస్తున్నాం



జిల్లాలో 36 ఎన్‌టిఆర్ వైద్య సేవ ఆస్పత్రులు ఉన్నాయి. అందులో పది ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను అందిస్తున్నారు. 26 ప్రయివేట్ ఆస్పత్రులకు గాను 22 ఆస్పత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్య సేవలను నిలిపివేశారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ గుర్తింపు ఉన్న ఆస్పత్రి వద్ద ఆరోగ్యమిత్రలు సిద్ధంగా ఉన్నారు. ప్రజలకు ఎటువంటి వైద్యసాయం అవసరమైనా ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి. వారిని 104, 108 ద్వారా విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి, మిమ్స్‌కి తరలించి వైద్య సేవలు అందిస్తున్నాం.

- కుప్పిలి సాయిరాం, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్, విజయనగరం

## పెరిగిన తాటిపూడి నీటిమట్టం

ప్రజాశక్తి-గంట్యాడ



గేట్లు ఎత్తి విడుదల చేస్తున్న నీరు

ఎగువున శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని తాటిపూడి జలాశయం నీటిమట్టం 296 అడుగులకు పెరిగింది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 297 అడుగులు. జలాశయంలోకి సుమారు 1012 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం గేటు ఎత్తి గోస్తనీ నదిలోకి 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షం ప్రభావం ఎక్కువగా ఉంటే గోస్తనీ నదిలోకి అధికంగా నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఎఇ శంకర్ తెలిపారు.

## జిఎస్‌టి మార్పులతో ప్రయోజనం లేదు

**విజయనగరం టౌన్ :** జిఎస్‌టి 2.0 పేరుతో ఊదరగొడుతున్నా.. దాని వల్ల సామాన్యులకు ఒరిగిందేమీ లేదని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు ఎం.అప్పలరాజు, బి.గిరిప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఊటగెడ్డ వద్ద ఆ పార్టీ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించారు. జిఎస్‌టి శ్లాబ్‌రేటు తగ్గించడం ద్వారా ధరలు తగ్గిపోయాయని, వివిధ వర్గాల ఆదాయం పెరిగిందని పాలకులు, అధికారులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని వారు చెప్పారు. గత ఎనిమిదేళ్ల నుంచి రూ.లక్షల కోట్లు జిఎస్‌టి వసూలు చేసి కార్పొరేట్లకు దోచిపెట్టారని ధ్వజమెత్తారు.

## పిఎస్‌ఆర్ పాఠశాలలోటెక్ ఫైర్ టాలెంట్ టెస్ట్

**విజయనగరం టౌన్ :** నగరంలోని రింగ్‌రోడ్డులో ఉన్న పిఎస్‌ఆర్ పాఠశాలలో ఆదివారం టెక్ ఫైర్ ఇంటర్ స్కూల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు పది పాఠశాలల నుంచి ఆరోతరగతి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు స్కూల్ కరస్పాండెంట్ పాకలపాటి సన్యాసిరాజు తెలిపారు. విజేతలకు ఫిబ్రవరిలో జరిగే పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా వెండి పతకాలు, నగదు అందించనున్నట్లు ప్రకటించారు.

# ఉలిక్కిపడ్డ పార్వతీపురం


- ఆర్‌టిసి పార్సిల్ సెంటర్ వద్ద బాణసంచా పేలుడు
- ఫ్యాన్సీ వస్తువుల ముసుగులో దీపావళి సామగ్రి
- నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మన్యం జిల్లా ప్రధాన కేంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రశాంతంగా ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో బాంబు పేలుడు శబ్దం వినిపించింది. కళ్లు తెరిచి చూసేలోగా ఆర్‌టిసి కొరియర్ సర్వీస్ కౌంటర్‌కు సమీపాన రక్తస్రావంతో నలుగురు వ్యక్తులు చెల్లాచెదురై కనిపించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

విజయనగరం నుంచి పార్వతీపురం వరకు ఫ్యాన్సీ సామాన్ల ముసుగులో బుకింగ్ అయిన పార్సిల్ బాక్స్‌ను ఆర్‌టిసి కళాసీలు అందుకున్నారు. బస్సులో నుంచి తీసుకువచ్చి సర్వీస్ సెంటర్ ముందు భాగంలో దించగానే బాణసంచా పేలుడు జరిగింది. ఈ పేలుడు ధాటికి సర్వీస్ కౌంటర్ ముందర భాగంలో ఉన్న రేకులు, కిటికీ అద్దాలు ఛిద్రమయ్యాయి. ఈ సంఘటనలో బెలగాంకు చెందిన ఆర్‌టిసి కళాసీ రెడ్డి రమేష్‌తో పాటు, నర్సిపురానికి చెందిన బస్ డ్రైవర్ తెర్లి రవి, తోపుడు బండి కార్మికుడు బోనెల సుందరరావు, అదే సమయంలో పార్సిల్ సెంటర్ కి వచ్చిన పట్టణానికి చెందిన కింతల రమేష్ అనే వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పట్టణ సిఐ మురళీధర్, ఎస్సై గోవిందరావు, ట్రాఫిక్ పోలీసులు, ఫైర్స్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని సంఘటన వివరాలను సంబంధిత కార్గో పార్సిల్ కొరియర్ సర్వీస్ సిబ్బందిని విచారించారు.

విజయనగరం నుండి కొత్తకోట కిషోర్ అనే వ్యక్తి పేరిట పార్శిల్‌ను బుక్ చేశారు. విజయనగరంలో నెల్లి సాంబ అనే వ్యక్తి పార్శిల్‌ను బుక్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రతి పార్సిల్‌ను సిబ్బంది పరిశీలించకపోవడంపై ఆయన ఆగ్రహించారు. ఘటన బస్సులో జరిగితే ఎంత ప్రాణాపాయం జరిగేదన్నారు. తీవ్రంగా గాయపడిన కింతల రమేష్, తెర్లి రవిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. రెడ్డి రమేష్‌ను విజయనగరం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాని జిల్లా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దర్యాప్తు జరిపి నిత్యం ప్రజలు ప్రయాణించే బస్సులో పార్సిల్ సర్వీసు ద్వారా నిషేధిత మందు గుండు సామాగ్రి బుక్ చేసిన వారిని కనిపెట్టి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిషేధిత మందుగుండు సామగ్రి బుక్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసి బస్సులో ఈ పేలుడు జరిగి వుంటే ప్రాణనష్టం ఎక్కువగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పేలుడులో గాయపడ్డ సుందరరావు

## దీపావళి వెలుగులు నింపాలి

### జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నాయకులకు, కార్యకర్తలకు ఒక ప్రకటన ద్వారా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## డిఎ పెంపుపై హర్షం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

డిఎ పెంపుపై ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.శ్రీధర్‌బాబు, ఎ.సురేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. పిఆర్‌సి కమిషన్, ఐఆర్, మిగిలిన డిఎ బకాయిలను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫైర్ చెస్ స్కూల్లో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-13 విభాగంలో సన్ స్కూల్ విద్యార్థి సాయిధృతి ప్రథమ, ఇన్‌స్పైర్ స్కూల్ విద్యార్థి రొంగల్ ప్రేమ్‌కుమార్ ద్వితీయ, సారిక జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి బి.నవీన్ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ టోర్నమెంట్‌కు అసోసియేషన్ ప్రతినిధి కె.వి.జ్వాలాముఖి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

## తైక్వాండో పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జీ స్టేడియంలో ఆదివారం తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్, క్యాడెట్ తైక్వాండో పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి సుమారు 90 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలైన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో రాజీవ్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో సుంకరి సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కలగర్ల రాంబాబు, కోచ్ వి.చారి ప్రసాద్ పాల్గొన్నారు.



తైక్వాండోలో తలపడుతున్న క్రీడాకారులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్ఎం విజయలక్ష్మి

## బాక్సింగ్‌లో జొన్నవలస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల రాజమండ్రిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జొన్నవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు బొబ్బాది పూజిత, ఎం.విష్ణుప్రియ సత్తాచాటారు. అండర్-17లో 60- 63 కిలోల విభాగంలో పూజిత కాంస్యం, అండర్-19లో 70-73 కిలోల విభాగంలో ఎం.విష్ణు ప్రియ రజత పతకం సాధించారు. వీరితోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు దేవమణి, ఎస్.విజయలక్ష్మిని హెచ్ఎం టి.విజయలక్ష్మి అభినందించారు.

## మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

**విజయనగరం టౌన్ :** మత్తు పదార్థాలు వినియోగంతో యువత జీవితాలు చిత్తవుతాయని ప్రముఖ సైకాలజిస్టు ఎన్‌విఎస్ఎస్ సూర్యనారాయణ తెలిపారు. రెడ్‌క్రాస్ భవనంలోని సెమినార్ హాల్లో 'మత్తు పదార్థాల వ్యసనం, నివారణ, పునరావాసం' అనే అంశంపై మహారాజా ఫార్మసీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలను వివరించి యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కుటుంబ మద్దతు, భావోద్వేగ నియంత్రణ, సానుకూల ఆలోచన వంటి అంశాలు వ్యసన నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసైన వారికి మనోపరమైన కౌన్సిలింగ్, ప్రవర్తన మార్పు, ప్రేరణాత్మక చికిత్సలు, సమాజ ఆధారిత పునరావాస పద్ధతులు ఎంతో మేలు చేస్తాయని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి చందక మన్మథరావు పాల్గొన్నారు.

# జిల్లాలో కల్తీ మద్యం లేదు

- సురక్ష యాప్ ద్వారా అక్రమార్కులకు చెక్
- బెల్టుషాపులను ఉపేక్షించం
- నెలకు సగటున రూ.4.8 కోట్ల విక్రయాలు
- 'ప్రజాశక్తి'తో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ముఖాముఖి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

**జిల్లాలో కల్తీ మద్యం అనే ప్రసక్తే లేదని ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు స్పష్టంచేశారు. సురక్ష యాప్ ద్వారా అక్రమార్కులకు చెక్ పెడుతున్నామని చెప్పారు. కల్తీ మద్యం అనేది కేవలం అసత్య ప్రచారమని తెలిపారు. మద్యం బెల్ట్‌షాపులను కూడా ఉపేక్షించేది లేదన్నారు. ఇందుకనుగుణంగా ప్రభుత్వం నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు కూడా ఉన్నాయని వివరించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నెలకు సగటును రూ.4.8 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ఇది ఇతర జిల్లాలతో పోలిస్తే తక్కువేనని వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి శ్రీనాథుడు ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...**

**జిల్లా కల్తీ మద్యం ఉన్నట్టు జరుగుతున్న ప్రచారంపై మీరేమంటారు.?**

జిల్లాలో కల్తీ మద్యం అనే ప్రసక్తే లేదు. ఇది పూర్తిగా అసత్య ప్రచారం. ఈ రకమైన ప్రచారం వినిపించాక జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాం. ఎక్కడా అటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. ఎవరైనా కల్తీ మద్యాన్ని గుర్తిస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం. ఆయా బాటిళ్ల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవడానికి మేం నిరంతరం సిద్ధంగా ఉంటాం.

**కల్తీ మద్యాన్ని ఎలా నిర్ధారిస్తారు.?**


కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు ఎపి ఎక్సైజ్ సురక్ష అనే యాప్‌ను కూడా ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు గానీ, రిటైల్ దుకాణదారులు గానీ ఎక్కడైనా, ఎప్పుడైనా పరిశీలించుకోవచ్చు. మద్యం బాటిల్ ధరతోపాటు ఎక్కడ? ఎప్పుడు తయారైంది? బ్యాచ్ నెంబర్ తదితరాలన్నీ ఉంటాయి. యాప్ ద్వారా స్కాన్ చేయగానే తెలిసిపోతుంది. వెంటనే సమీపంలోని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అయితే, ఈ యాప్ లిక్కర్‌కు మాత్రమే పరిమితం. బీర్ బాటిల్స్‌కు ఇది ఉపయోగపడదు.

**కల్తీ మద్యం ప్రచారం నేపథ్యంలో మీరు తీసుకుంటున్న చర్యలేమిటి.?**

కల్తీ మద్యం అనే ప్రచారం ఉనికిలోకి రావడంతో గడిచిన పది రోజులుగా అన్ని దుకాణాలపైనా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఎక్కడా అటువంటి మద్యం దొరక లేదు. ఒకవేళ అటువంటి మద్యం దొరికితే విక్రయించిన వారిపై, తయారీదారులపైనా కఠిన చర్యలు ఉంటాయి.

**బీరులో కల్తీ జరిగితే పరిస్థితి ఏమిటి.?**

బీరు బాటిళ్లు ఎక్కువ సమయం ఫ్రిజ్‌లలో కూలింగ్ అవుతూ ఉంటాయి. కాబట్టి ఆయా లేబుళ్లు చెరిగిపోయే అవకాశం ఉంటుంది. స్కాన్ చేయడం కూడా కష్టతరంగా ఉంటుంది. అందువల్ల ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌లో బీరు బాటిల్స్‌కి మినహాయింపు. భవిష్యత్తులో వీటికి కూడా యాప్ తయారు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. మా శాఖ ఆధ్వర్యాన ఇటువంటి కసరత్తు కూడా ప్రారంభమైంది.





**బెల్ట్ షాపుల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?**


ప్రస్తుతం దాడులు ముమ్మరం చేశాం. బెల్ట్‌షాపులు నడుపుకోవడానికి అనుగుణంగా మద్యం విక్రయించవద్దంటూ రిటైల్ (ఎ4) దుకాణదారులకు ఆదేశాలు జారీచేశాం. అవసరమనుకున్న చోట్ల ఆయా దుకాణాల యజమానుల నుంచి పూచీకత్తులు కూడా తీసుకుంటున్నాం. మరోవైపు ఇప్పటికే బెల్ట్‌షాపుల నిర్వహించిన వారిని బైండోవర్ చేస్తున్నాం. అప్పటికీ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించేందుకు కూడా వెనుకాడేది లేదు. ఇందుకనుగుణంగా శాఖాపరమైన ఆదేశాలు స్పష్టంగానే ఉన్నాయి.

**జిల్లా వాప్తంగా ఎన్ని దుకాణాలు ఉన్నాయి.?**

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మొత్తం 225 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో విజయనగరం జిల్లాకు సంబంధించి 169, మన్యం జిల్లాలో 56 దుకాణాలు ఉన్నాయి. వీటిపై నిరంతర పర్యవేక్షణ ఉంటోంది. క్రయ, విక్రయాలు, వాటిలో నాణ్యతా ప్రమాణాలు, స్టాకు, రికార్డుల నిర్వహణ తదితరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

**మద్యం విక్రయాలు ఎలా ఉన్నాయి.?**

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నెలకు సరాసరి రూ.4.8 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే కాస్త తక్కువగానే ఉంది. పండగలు, ప్రత్యేక అకేషన్లు ఉన్నప్పుడు విక్రయాలు కాస్త పెరుగుతున్నాయి.


అవార్డులతో పతివాడ భానుప్రసాద్

## రాష్ట్ర స్థాయి సెమినార్‌లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి పతివాడ భానుప్రసాద్ రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్ సెమినార్-2025 లో విజేతగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ నుండి మొత్తం 52 మంది పోటీ పడిన ఈ సెమినార్లో భాను ప్రసాద్ ఒక్కడే నేషనల్ లెవెల్‌కి ఎంపికయ్యాడు. ఈ నెల 18న విజయవాడ లొయోలా కాలేజీలో జరిగిన ఫైనల్లో విన్నర్ అవార్డు, ప్రశంస పత్రం, సర్టిఫికేట్ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఎం. వెంకటకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందుకుని విజయనగరం జిల్లా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. వై.రెబెక్క సెల్సి, పిజిటి జువాలజీ గైడ్ టీచర్ మార్గదర్శకత్వంలో ఈనెల 29న బెంగళూరులో జరగబోయే నేషనల్ లెవెల్ సైన్స్ సెమినార్‌లో 'క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్ అండ్ చాలెంజెస్' మీద ప్రెజెంటేషన్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారులు అభినందించారు తెలిపారు.

## రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - కొత్తవలస

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో చీడివలస గ్రామంలో వరి, అపరాల పంటలపై సస్యరక్షణ మీద ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ ఆవశ్యకత తెలియచేస్తూ రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని, వాటికి బదులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని తెలిపారు. లక్ష్మణరావు మాట్లాడుతూ జీవన ఎరువుల ఉపయోగాలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంచార్జ్ ఎడిఎ హరికృష్ణ మాట్లాడుతూ తగిన మోతాదులో రసాయన ఎరువులు వాడుతూ క్రమేపి తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని, దాని వల్ల నేల ఆరోగ్యం కాపాడవచ్చు అని అన్నారు. ఎఱ కెవి రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ వరి పంట, అపరాల సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## రోడ్డుకిరువైపులా చెట్లతో ఇబ్బందులు

ప్రజాశక్తి- సంతకవిటి


ఇరువైపులా పెరిగిన మొక్కలు

మండలంలోని కావలి నుంచి వాల్తేరు గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా చెట్లు గడ్డివరసగా, ఏపుగా పెరిగిపోయాయి. ఈ చెట్లు వాహనదారులకు అడ్డంగా మారుతున్నాయి. ముఖ్యంగా మలుపుల వద్ద ఎదురు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. శ్రీకాకుళం నుండి కావలి మీదుగా పనసపేటకు వెళ్లే రహదారిలో ప్రయాణించడం ఎంతో ప్రమాదకరంగా మారిందన్నారు. దీంతో కొన్ని చోట్ల చెట్లు బస్సు అద్దాలను తాకే ప్రమాదం కూడా ఉందని వారు చెబుతున్నారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ విద్యపై కూటమి ప్రభుత్వం కుట్ర

ప్రజాశక్తి -చీపురుపల్లి

ప్రభుత్వ విద్యపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వల్లి రెడ్డి శ్రీనివాస్ నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలు నాయుడు అన్నారు. ఆదివారం చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని జి.అగ్రహారంలో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన వైద్య విద్యను అందించాలని ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేశారని అన్నారు. ఇప్పుడు ఆ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి పేద విద్యార్థులకు అన్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్ను తోందన్నారు. అందులో భాగంగానే ప్రజల నుండి కోటి సంతకాలు సేకరణ చేసి రాష్ట్ర గవర్నర్‌కి అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాండ్రంకి వాసుదేవరావు, గవిడి సురేష్, రౌతు పైడిరాజు, కోరుకొండ బాలయ్య, కర్రోతు ప్రసాద్ పాల్గొన్నారు.

## రామకృష్ణకు యోగాలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల శ్రీవివేకానంద విద్యా వికాస్ కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలో మాస్టర్స్ మెన్ గ్రూప్ సి (50-60)లో పట్టణానికి చెందిన బొబ్బిలి రామకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో ఈ నెల 25, 26 తేదీలలో విశాఖపట్నంలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే అవకాశాన్ని పొందారు. సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) సంస్థ సాధకులు, సర్వేపల్లి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.హృషీకేశ్, బి.లాస్యశ్రీ సబ్ జూనియర్ విభాగం (8-14) లో చక్కని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా యోగ శిక్షకులు సఖినేటి రవి, నడుపూరి పైడిరాజు, బమ్మిడి సన్యాసిరావు వ్యవహరించారు. ఎపి యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బూర్ల శ్రీధర్ అభినందించారు.

## హరిత దీపావళితో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

దీపావళి పండగను హరిత దీపావళిగా నిర్వహిద్దామని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని కొట్టాం హైస్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు రహీం షేక్‌లాల్ ఆదివారం పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వర్రి భాస్కరరావు మాట్లాడుతూ హరిత దీపావళి జాగృతికి పండగే, మనందరం దీపావళి పండగను పర్యావరణాన్ని కాపాడుతూ ధ్వని, వాయు కాలుష్య రహితంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉగ్గిన శ్రీను, ఎం.విశ్వనాథరావు, చిప్పాడ శ్రీను, డివి సూర్యనారాయణ, వర్రి భాస్కరరావు, పి.స్వప్న, బంగారు నాయుడు, పి.భాస్కర్, సింహాచలం నాయుడు, తీడ శ్రీను, సిబ్బంది శివప్రసాద్, సంతోష్, కొట్టాం గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

## రోడ్లపైకి మురుగు నీరు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి వరదనీరు పొంగిపొర్లడంతో కాలువలలో సక్రమంగా ప్రవహించక రోడ్లుపైకి మురుగునీరు వచ్చింది. చీపురుపల్లి వీధి కాలువలో పూడికలు పేరుకుపోవడం వల్ల మురుగునీరు రోడ్డుపైకి వచ్చి బల్లివీధిలోకి వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూల్ బాగ్ రోడ్డులో కూడా నీరు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వర్షం కురవడంతో పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# భూ రక్షా.. రైతులకు శిక్షా?

◆ జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లు ఇవ్వడంతో అన్నదాతకు తప్పని ఇక్కట్లు ◆ రెవెన్యూ సదస్సులు నిర్వహించి నెలలు గడుస్తున్నా దొరకని పరిష్కారం

ప్రజాశక్తి- మెరకముడిదాం

గత వైసిపి ప్రభుత్వం హయాంలో నిర్వహించిన భూ రీసర్వే కార్యక్రమం రైతులు పాలిట శాపంగా మారింది. అప్పట్లో ప్రభుత్వ ఆశయం మంచిదే అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో అనుకున్న విధంగా అమలు కాకపోవటంతో రైతులకు శిక్షగా మారింది. సర్వేనెంబర్లకు ఉమ్మడి ఎల్‌పిఎం నెంబర్లు రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు మేలు జరుగుతుందని ఎంతో ఆశపడ్డారు. కానీ రైతుల ఆశలు ఆడి ఆశలుగానే మిగిలాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రీ సర్వే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారు. ఫలితంగా రైతులకు అవే ఇబ్బందులు కొనసాగుతున్నాయి.


రీ సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది(ఫైల్)

మండలంలో చాలా గ్రామాల్లో వైసిపి హయాంలో భూములను రీసర్వే చేశారు. అందులో కొండలావేరు పంచాయతీ మధుర గ్రామం బాడాంలో నిర్వహించే రీసర్వే కార్యక్రమం 'భూ రక్ష రైతులకు శిక్ష' అన్న చందంగా తయారైంది. ఈ గ్రామంలో 2020 సంవత్సరంలో రీసర్వే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సర్వే నెంబర్లకు జాయింట్ ఎల్పిఎం నెంబర్లు ఇవ్వటంతో రీ సర్వే అయిన బాడాంలో 1బిలు రాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన 3నెలల్లో రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో నిర్వహించారు. రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల రూపంలో సర్వే నెంబర్లకు జాయింట్ ఎల్ పిఎం నెంబర్లు విడదీయమని దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు ప్రాప్తిగా అధికారులు రైతులకు రసీదులు కూడా ఇచ్చారు. సదస్సులో రైతులిచ్చిన దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని స్వయానా జాయింట్ కలెక్టర్ చెప్పినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాజముద్ర వేసిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంటేషన్ సర్వే నెంబర్లకు కూడా జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లను సర్వేయర్లు అస్తవ్యస్తంగా విడదీయడంతో మ్యుటేషన్ పెట్టినా కొన్ని సర్వే నెంబర్లలో ఉమ్మడి ఎల్‌పిఎంలను విడదీయడం లేదు. జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లను సర్వేయర్లు అస్తవ్యస్తంగా విడదీయడంతో రైతులు మరలా సబ్- డివిజన్‌కు ఒక సర్వే నెంబరుకు పెట్టాలంటే 550 రూపాయలు ఆన్‌లైన్‌లో చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సబ్- డివిజన్ అయిన తర్వాత మరలా మ్యుటేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

### అన్నదాత సుఖీభవకు దూరం

కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ ప్రకటించడంతో కొంత మంది రైతులకు ఉమ్మడి ఎల్‌పిఎంల వల్ల అన్నదాత సుఖీభవ పథకం అందలేదు. దీంతో పాటుగా రైతులు ఆడపిల్ల పెళ్లిళ్ల కోసం భూమిని విక్రయించాలనుకున్నా జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లు వల్ల క్రయవిక్రయాలు జరగక ఆడపిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుందామన్న వన్‌బిలు ఆన్‌లైన్‌లో రాక, బ్యాంకు రుణం అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులుకు ఆన్‌లైన్‌లో వన్‌బిలు వచ్చి, బ్యాంకులు ద్వారా రుణాలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## వైసిపి సోషల్ మీడియా జిల్లా ప్రధానకార్యదర్శిగా బాకీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలానికి చెందిన బాకీ వెంకటకనకరావు జిల్లా సోషల్ మీడియా విభాగ ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం వైసిపి కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆయన తెలిపారు.

### వైసిపి మండల అధ్యక్షులుగా ఉప్పాడ

మండలానికి చెందిన వైసిపి నూతన కార్యవర్గాన్ని ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటించినట్లు పార్టీ మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన్ను మరోసారి మండల అధ్యక్షులుగా, మండల ఉపాధ్యక్షులుగా మాజీ జెడ్‌పిటిసి బైరెడ్డి ప్రభాకరరెడ్డి, పడాల భానుప్రకాష్‌లను, జనరల్ సెక్రటరీలుగా దాట్ల శ్రీనివాసరాజు, కిలారీ వెంకటరమణ, వాసుపల్లి రెయ్యడు, అడపా ప్రసాదరావులను నియమించారని చెప్పారు. సెక్రటరీలుగా ఎన్. నర్సినాయుడు, సి.ఆనందరావు, శీరపు గురునాధరెడ్డి, పి. రామకృష్ణ, కొల్లి రామమూర్తి సహా మరో 24 మందిని సభ్యులుగా ఎంపిక చేశారని అన్నారు. అదనంగా నియోజకవర్గ ఎస్‌సి సెల్ కన్వీనర్‌గా పచ్చిపాల గురునాధరావు, మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా శీరపు వంశీరెడ్డిని నియమించినట్లు తెలిపారు.

## ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ

పట్టణంలోని పిఆర్ షటిల్ కోర్ట్‌లో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జిఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగుసాయని నియోజకవర్గ క్రీడా కోఆర్డినేటర్, చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ముగింపు వేడుకలలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు పాల్గొని మాట్లాడారు. క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, మానసిక ఉల్లాసానికి, వ్యక్తి మనోవికాసానికి, ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయని, క్రీడలు చదువులకు ఆటంకం కాదని ఆటలాడే క్రీడాకారులు చదువుల్లో ముందు ఒంటారని వారిలో చురుకుదనం అత్యుత్సాహం ఎంతగానో పెరుగుతాయని చెప్పారు. క్రీడలలో సాధించిన యోగితా పత్రాలు ఉన్నత చదువులకు ఉన్నత ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడతాయని, రాష్ట్ర ప్రభుత్వం 3శాతం స్పోర్ట్స్ కోటా కూడా కల్పిస్తుందని, క్రీడల వల్ల చదువులు పోతాయనే తల్లిదండ్రుల అపోహలను నిర్మూలించాలని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు త్వరలో జరగబోవు డివిజనల్ స్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కౌముది స్కూల్, రవీంద్ర భారతి స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జోనల్ స్థాయి ఆటల పోటీలకు ఎంపిక

**వేపాడ:** మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో విజేతగా నిలిచి జోనల్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ గోవిందరావు శిక్షణలో అండర్ 14 బాలురు విభాగంలో కబడ్డీలో వి.సుధీర్, కె.రోహిత్, హెచ్ దిలీప్, వై రోహిత్, యోగాలో వివేక్, రన్నింగ్‌లో సిహెచ్ చక్రి, హైజంప్‌లో డి. చైతన్య, అండర్ 17 విభాగంలో జావిలన్‌త్రోలో ఎన్ అజయ్, హైజంప్‌లో బిఆర్ నాయుడు, రన్నింగ్‌లో నవీన్, బాలికల విభాగంలో యోగాలో గీతిక, హర్షిత, ఖోఖోలో వర్షిని ఎంపికయ్యారని అన్నారు.

## ఇన్‌ఛార్జి డీలర్‌తో ఇబ్బందులు

●సకాలంలో రేషన్ అందక లబ్ధిదారులకు అవస్థలు ●పాత డీలర్‌ను కొనసాగించాలని డిమాండ్

ప్రజాశక్తి- రేగిడి


రేషన్ దుకాణం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

మండలంలోని సంకిలి గ్రామంలో రేషన్ డిపో-1 ఇంచార్జ్ డీలర్ మురళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు వాపోయారు. గతేడాది నుంచి ఇంఛార్జి డీలర్ సకాలంలో రేషన్ ఇవ్వకపోవడంతో పాట్లు పడుతున్నామని రేషన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొడ్డవలస, చిన్నశిర్లాం రేషన్ ఇచ్చుకుంటూ ఆయన సంకిలి డిపోకు రావడంతో తమకు ఆలస్యమవుతోందని ఒకరోజు ఇచ్చి రెండు రోజులు సరుకులు ఇవ్వడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు ఉదయం, మధ్యాహ్న సమయాల్లో కాకుండా ఆయనకు ఎప్పుడు నచ్చితే అప్పుడు ముందస్తు సమాచారం లేకుండా వచ్చి సరుకులు ఇవ్వడం వల్ల అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. వాస్తవంగా పాణంగిపల్లి నర్సింగరావు అనే డీలరు తన భార్యా అనారోగ్యం కారణంగా అప్పటి సిఎస్‌డిటి అనుమతితో సెలవు పెట్టారు. అనంతరం డీలరు భార్య మృతి చెందడంతో కొన్ని రోజులు సెలవులో ఉన్నారు. 9 నెలలుగా తన డీలర్ పోస్ట్ తనకు ఇవ్వమని అప్పటి తహశీల్దార్ ఎల్లారావుకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తహశీల్దార్ తన పోస్టును తనకు ఇవ్వాలని సిఎస్‌డిటికి రిఫర్ చేశారు. అప్పటి సిఎస్‌డిటి పిన్నింటి రామారావు కొర్రీలు పెట్టి నెలలు తరబడి వాయిదా వేసుకుంటూ వచ్చారు. నేటి వరకు డీలర్ పోస్టు పునరుద్ధరించలేదు. దీంతో ఇంఛార్జి డీలర్ సరుకులు ఇవ్వాల్సి వస్తుంది. ఈ రేషన్ డిపోలో 500కుపైగా రేషన్ కార్డులు ఉన్నాయని కొంతమందికే రేషన్ సరుకులు ఇచ్చారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో కొంతమందికి రేషన్ ఇవ్వక ఇబ్బందులు పడ్డామన్నారు. మరి కొంతమందికి సకాలంలో డీలర్ రాక బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్ర వేయించక రేషన్ తీసుకోలేకపోతున్నామని ఆవేదన చెందారు. గ్రామంలో ఉండే పాత డీలర్ నర్సింగ్‌రావును కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న గద్దె బాబురావు

కేన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ ప్రభుత్వ విప్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు అన్నారు. ఆదివారం చీపురుపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద మానవీతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విజృంభిస్తున్న రోగాలతో పాటు కేన్సర్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి మహిళలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మానవీతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు బివి గోవిందరాజు మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ సేవ చేయడానికి మానవీయత సంస్థ ముందుందని ఏ ఒక్కరికైనా సహాయం కావాలంటే స్వచ్ఛందంగా తమ సంస్థ ముందుకు వస్తుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో బీపీ షుగర్ గుండెకి సంబంధించిన ఇతర పరీక్షలు డాక్టర్ తులసి మహాలక్ష్మి ద్వారా నిర్వహించారు. సంస్థ ద్వారా ప్రతి 15 రోజులకు ఒకసారి మండలంలోని గ్రామాల వారీగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఏ గ్రామంలో వారైనా ఉచిత కంటి పరీక్షలు వైద్య పరీక్షలు నిర్వహించడానికి 8919264993, 9247818604 సెల్ నెంబర్లకు సంప్రదించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు, కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ విజినిగిరి శ్రీనివాసరావు, రామ్మూర్తి నాయుడు, మీసాల లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

## జిందాల్ బాధితులపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - వేపాడ


నిరసన తెలుపుతున్న గిరిజనులు

జిందాల్ బాధితులపై నిర్లక్ష్యం తగదని సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ అన్నారు. ఎస్‌కోట మండలంలోని బొడ్డవర వద్ద జిందాల్ నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఆదివారం మండలంలోని బొద్దాం వద్ద గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొడ్డవర ప్రాంతంలో అల్యూమినియం ఫ్యాక్టరీ పెడతామని చెప్పి గిరిజనుల వద్ద నుంచి భూమిని తీసుకున్న యాజమాన్యం కంపెనీ పెట్టకుండా మోసగించిందన్నారు. ఐదు పంచాయతీలకు చెందిన దళిత గిరిజనులు తమ వద్ద ఉన్న కొద్దిపాటి భూములను జిందాల్‌కు ఇచ్చి మోసపోయారన్నారు. నేటికి 18 సంవత్సరాలైనా కంపెనీ కట్టలేదు సరి కదా మోసపూరితంగా జీవో నెంబర్ 14 ద్వారా జిందాల్ అల్యూమినియం కంపెనీ కోసం సేకరించిన భూమిని పారిశ్రామిక రియల్ ఎస్టేట్ కోసం షేర్లు వేసి అమ్మేందుకు సిద్ధపడుతున్నారన్నారు. అటువంటి చర్యలను మానుకోవాలని హెచ్చరించారు.

**శృంగవరపు కోట:** జిందాల్ బాధితుల నిరసన ఆదివారం నాటికి 121వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండలంలోని బొడ్డవరలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో నిర్వాసితులు కలెక్టర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమకు నాడు హామీలు ఇచ్చినవారే ఇప్పుడు మోసం చేస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభలో కలెక్టర్ ఇచ్చిన హామీల మేరకే భూములు ఇచ్చామని, కానీ ఇప్పటి వరకు పరిహారం, ఉద్యోగాలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఏవి అమలు కాలేదని అన్నారు. భూమి ఇచ్చిన రైతుకు న్యాయం చేయకుండా, కంపెనీకి కలెక్టర్ అండగా నిలిచారని ఆరోపించారు.

## రాజాంలో అక్రమ కమర్షియల్ కాంప్లెక్సులు

చట్టాన్ని ఉల్లంఘిస్తున్న బడాబాబులు

ప్రజాశక్తి- రాజాం

పట్టణం వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న వేళ, కొందరు టిడిపి నాయకుల రాజకీయ మద్దతుతో నిబంధనలను పక్కనపెట్టి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా పాలకొండ రోడ్డులో వందల కోట్లు వ్యయంతో నిర్మించిన ఐదు అంతస్థుల వాణిజ్య భవనం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. ప్లాన్ అప్రూవల్ ప్రకారం సెల్లార్, షిల్ట్ ఫ్లోర్ లేకుండా నిర్మాణం జరిపినప్పటికీ, ఆక్యుపేషన్ అనుమతులు తీసుకోకుండా వ్యాపార సంస్థలకు కేటాయించడంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడం వల్ల రోజూ ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యం తలెత్తుతున్నాయని స్థానికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మున్సిపల్ అధికారులు స్పందించి నోటీసులు జారీ చేసినప్పటికీ, భవన యజమాని ఓ ప్రముఖ రాజకీయ నేతను వాడుకొని, అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి భారీ మొత్తంలో లావాదేవీలు జరిగినట్లు తెలిస్తోంది. ఆ భవంతికి కనీసం పార్కింగ్ సెల్లారు కూడా ఇవ్వకపోవడంతో వాహనాలను బయట పెడుతున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయ ఏర్పడుతుందని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### మళ్లీ నోటీసులు ఇస్తాం

నేను కొత్తగా వచ్చాను. అన్ని ఫ్లోర్లకు అనుమతులున్నాయి. కానీ కింద పార్కింగ్‌కు స్థలం వదలకుండా కమర్షియల్ కాంప్లెక్స్ కట్టేశారు. బిల్డింగ్ యజమానికి కనీసం ఆక్యుపేషన్ సర్టిఫికేట్ కూడా ఇవ్వకుండానే అద్దెలకు ఇచ్చేశాడు. దీనిపై కమిషనర్ కూడా నోటీసు ఇచ్చారు. మళ్లీ మరో నోటీసు ఇస్తాం.


శాస్త్రి, టౌన్ ప్లానింగ్ అధికారి రాజాం



అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవంతి

## ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు కోచ్‌గా హేమంత్

ప్రజాశక్తి - చీపురుపల్లి



పట్టణానికి చెందిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ఫ్రాన్స్‌లోని ఆల్‌బిలో జరగనున్న 24 గంటల అల్ట్రా రన్నింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం నుండి అథ్లెటిక్స్ కోచ్‌గా ఎంపిక కావడం పట్ల స్థానిక క్రీడాకారులు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిలో ఇంటర్నేషనల్ ఆఫ్ అల్ట్రా రన్నర్ ఐఎయు ఆధ్వర్యంలో బెంగుళూరులో జరిగిన 100 కిలోమీటర్ల అల్ట్రా రన్నింగ్ ప్రపంచ ఛాంపియన్షిప్ పోటీలకు కంది హేమంత్ కోచ్‌గా వ్యవహరించారు. హేమంత్ నిత్యం ఫిట్నెస్‌పై శ్రద్ధ చూపించి ఓవైపు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌గా ఉద్యోగ బాటలో ఉంటూ మరోవైపు చీపురుపల్లి పరిసర ప్రాంతంలో నిరుపేద విద్యార్థులందరికీ శారీరక దేహదారుఢ్య శిక్షణ ఉచితంగా అందజేస్తూ పలువురు మనల్ని పొందుతున్నాడు. హేమంత్ వద్ద కోచింగ్ తీసుకున్న సుమారు 18 మంది యువతీ యువకులు తాజాగా జరిగిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలను కూడా సాధించారు. నేవీ ఉద్యోగిగా అటు దేశానికి సేవలందిస్తూ స్థానిక యువకుడిగా స్థానిక నిరుద్యోగుల పట్ల దృష్టి సారించి పోలీస్ డిఫెన్స్ నేవీ ఉద్యోగాల కోసం అవసరమైన సూచనలు సలహాలతో పాటు ఫిట్నెస్ పరీక్షలు కూడా నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

## రెవెన్యూ సేవలపై ఆరా

ప్రజాశక్తి - గజపతినగరం



రైతులుతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ

మండలంలోని కొత్త బగ్గాం, పాతబగ్గాం గ్రామాల్లో ఆదివారం రెవెన్యూ సేవలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల గాంధీ ఆరా తీసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ముటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులతో సమావేశం ఏర్పాటు చేసి గత కొన్ని రోజులుగా వారికి వస్తున్న ఐవిఆర్ఎస్ కాల్స్, గ్రామ రెవెన్యూ అధికారి సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రెవెన్యూ సేవలపై సంబంధిత అధికారులు లంచం అడిగితే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ఈ సమావేశంలో కొత్త బగ్గాం, పాత బగ్గాం గ్రామాలకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు బొత్స రమణ, లెంక చిన్నంనాయుడు గ్రామ రెవెన్యూ అధికారులు రాజేష్, అప్పలనాయుడు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - భోగాపురం

రాజాం పర్యటనకు వచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు మార్గం మధ్యలో భోగాపురం జనసేన పార్టీ కార్యాలయం వద్ద నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందచేసిన దుస్సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు లోకం ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వందనాలు రమణ, పల్లంట్ల జగదీష్, కర్రోతు శ్రీనివాసరావు, పల్లా రాంబాబు పాల్గొన్నారు.

## కిలో వెండి వస్తువులు వితరణ

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణానికి చెందిన కిల్లంశెట్టి సన్యాసిరావు, శోభ దంపతులు ఆదివారం స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి రూ.1.80లక్షలు విలువ చేసే వెండి గిన్నె, పల్లెం వితరణగా అందజేశారు. సన్యాసిరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కిలో వెండి వస్తువులను ఆలయ ఇఒ ఎస్ నానాజీబాబు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బలగ రామారావు, వలి రెడ్డి రవీందర్ నాయుడు, సూరుకుమార్, ఎస్‌విజీ శ్రీనివాసరావు, సూరు వెంకటేష్, ఉరిటి రమణ, పొట్నూరు నర్సింగరావు, గద్దె అనురాగ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.